జీఐ కోసం మరో 10 ఉత్పత్తుల ఎంపిక

త్వరలో కేంద్రానికి దరఖాస్తులు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): భౌగోళిక గుర్తింపు (జీఐ) కోసం దరఖాస్తు చేసేందుకు రాష్ట్రానికి చెందిన మరో 10 ఉత్పత్తులను ఎంపిక చేశారు. వీటిలో హైదరాబాద్ ముత్యాలు, ఆర్మూర్ పసుపు, నారాయణపేట ఆభరణాలు, మెదక్ బాతిక్ పెయింటింగ్స్, నల్లగొండ బంజారా నీడిల్ క్రాఫ్ట్స్, బంజారా ట్రైబల్ జువెలరీతోపాటు కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్శిటీ నుంచి బాలానగర్ సీతాఫలం, నల్లగొండ పిక్లింగ్ మెలోన్, అనబ్షాహీ ద్రాక్ష, ఖమ్మం మిర్చీ ఉన్నాయని ప్రముఖ జీఐ ప్రాక్టీషనర్, రిజల్యూట్ 4ఐపీ వ్యవస్థాపకులు సుభాజిత్ సాహా వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణలోని 17 ఉత్పత్తులకు జీఐ గుర్తింపు లభించింది. వరంగల్ చపాటా మిర్చీకి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో గుర్తింపు లభించే అవకాశముందని జీఐ వర్గాలు తెలిపాయి. ఉత్పత్తుల చరిత్ర, వాటి భౌగోళిక మూలాలు, ఖ్యాతి తదితర అంశాల ఆధారంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధీనంలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్ మార్క్స్ విభాగం భౌగోళిక గుర్తింపును మంజూరు చేస్తుంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,408 ఉత్పత్తులకు జీఐ కోసం దరఖాస్తు చేయగా.. 658 ఉత్పత్తులకు గుర్తింపు లభించింది.

తెలంగాణ నుంచి జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులు

కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, చేర్యాల పెయింటింగ్స్, హైదరాబాద్ హలీం, నారాయణపేట చేనేత చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, ఆదిలాబాద్ డోక్రా, బంగినపల్లి మామిడి (తెలంగాణ, ఏపీ), గద్వాల చీరలు, నిర్మల్ ఫర్నిచర్, నిర్మల్ పెయింటింగ్స్, నిర్మల్ చెక్క బొమ్మలు, హస్తకళలు, పెంబర్తి మెటల్ క్రాఫ్ట్స్, పుట్టపాక తేలియా రూమాల్, హైదరాబాద్ లక్క గాజులు, పోచంపల్లి ఇక్కత్, తాండూర్ కందులు.

పీఆర్టీయూకే వొకేషనల్ టీచర్స్ మద్దతు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : శాసన మండలి ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులకు వొకేషనల్ టీచర్స్ యూనియన్ మద్దతు ప్రకటించింది. పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ వొకేషనల్ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆదివారం లేఖ అందజేశారు. ఈ ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాలో జనగామ జిల్లావాసి మృతి

గొడుగు శ్రీనివాస్ (ఫైల్)

కొడకండ్ల, డిసెంబర్ 29 : ఉపాధి కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన జనగామ జిల్లా వాసి అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన గొడుగు శ్రీనివాస్ (52) ఉపాధి కోసం ఈ ఏడాది జూలై 24న దక్షిణాఫ్రికా దేశంలోని కాంగో రాష్ట్రం లుపోమాషి నగరానికి వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పనికి కుదిరాడు. ఈనెలలో మలేరియా రావడంతో కంపెనీలోని డాక్టర్లు ఇచ్చిన మందులు వాడాడు. సరైన వైద్యం అందకపోవడంతో లివర్ ఇన్‌ఫెక్షన్‌తో ఈ నెల 25న మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చనిపోయి 4 రోజులైనా తమకు ఎలాంటి సమాచారం లేదని, మృతదేహం ఎప్పుడు వస్తుందో తమకు తెలియదని, ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఈ అల్పపీడనాలకు ఏమైంది?

- గతానికి భిన్నంగా తీవ్రరూపు
- కాలుష్యమే కారణం: శాస్త్రవేత్తలు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏటా ఏర్పడే అల్పపీడనాల సంఖ్య పెరుగుతున్నదని వాతావరణ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఈ ఏడాది నైరుతికి పోటీగా ఈశాన్య రుతుపవనాల సీజన్‌లోనూ అల్పపీడనాలు ఎక్కువగా ఏర్పడ్డాయని తెలిపారు. అల్పపీడనాల గమనం కూడా అసాధారణంగా ఉంటున్నదని చెప్పారు. గతంలో తుపాను అంటే భయపడే ప్రజానీకం ఇప్పుడు అల్పపీడనం అంటే కూడా ఆందోళన చెందాల్సి వస్తున్నదని తెలిపారు. సాధారణంగా అల్పపీడనాలు అక్టోబర్, నవంబర్‌లో ఒడిశా, ఉత్తర కోస్తా మధ్యలో తీరాన్ని, నవంబరు తర్వాత మచిలీపట్నం, ఒంగోలు వద్ద, డిసెంబరులో తమిళనాడులో తీరం దాటుతాయి. కానీ 2023లో ఏర్పడిన తుపాన్లు అన్నీ గమనం మార్చుకున్నాయని వివరించారు. 1965-2022 మధ్య అల్పపీడనాల గణాంకాలను చూస్తే అరేబియాలో ఏటా సగటున 12 అల్పపీడనాలు ఏర్పితే ఈ సంవత్సరం ఒక్క బంగాళాఖాతంలోనే 14 అల్పపీడనాలు ఏర్పడ్డాయని చెప్పారు. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తటస్థంగా ఉన్నదని, హిందూమహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయని వెల్లడించారు.